క్లుప్తంగా

ఆంజనేయస్వామి కలశ ఊరేగింపు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కలశ, పల్లకీ సేవ ఊరేగింపును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి మాలధారులు ఇరుముడి కట్టుకునే ముందు రోజు పూజలు నిర్వహిస్తారని గురుస్వాములు తెలిపారు. బెస్తగేరి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వాహనాల్లో కళశంతో పాటుగా ఆంజనేయస్వామి, రాముల చిత్రపటాలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్, మండల సింగల్‌విండో ఉపాధ్యక్షుడు క్యామ రాజు హాజరై స్వామి వారి పల్లకీ మోశారు.

రచయిత రాఘవాచారికి సన్మానం



వనపర్తి రూరల్: ప్రముఖ సాహితీవేత్త, రచయిత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పోతేదార్ రాఘవాచారిని ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సాహిత్య సేవను శంకర్ కొనియాడారు. కార్యక్రమంలో కవులు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం



ఆత్మకూర్: పవిత్ర మక్కా మదీనా ఉమ్రా యాత్రకు వెళ్తున్న మహమ్మద్ యూనిస్ కుటుంబ సభ్యులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, మెకానిక్ షబ్బీర్, గంగాధర్‌గౌడ్, పరమేష్, అక్బర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అలిశెట్టి ప్రభాకర్ సేవలు మరువలేనివి



వనపర్తి టౌన్: జనజీవన ప్రవంతిని జాగృతం చేసేందుకు అలిశెట్టి ప్రభాకర్ చేసిన సాహిత్య పోరాట సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సమాజాన్ని చైతన్యం పరిచేందుకు ఉత్తర తెలంగాణ నుంచి తన పోరాట పంథాను విశ్వవిఖ్యాతం చేశాడన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నర్సింహాశర్మ, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మానసకు సేవారత్న పురస్కార్ అవార్డు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ బాధగొని కుమార్‌గౌడ్, శారదమ్మ దంపతుల కుమార్తె (షైన్ ఏ లైఫ్ ట్రస్ట్ ఫౌండర్) అయిన బాధగొని మానసగౌడ్‌కు సేవారత్న పురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. వివేకానందుడి జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికాస్ పరిషత్ ప్రముఖులు సుబ్బారావు, హన్మంత్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌గౌడ్ బాధగొని మానసకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రముఖులు నాగరాజు, మాధవిలత, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.





పామిరెడ్డిపల్లిలో..



కదుకుంట్లలో..

వివేకానందుడి జీవితం ఆదర్శం

సాక్షి, నెట్‌వర్క్: స్వామి వివేకానందుడి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖులు, వక్తలు అన్నారు. ఆదివారం వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు హిందూవాహిని, బజరంగ్‌దళ్ నాయకులతో పాటు యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ హితం కోసం పనిచేయాలని కోరారు. అనంతరం ఆస్పత్రుల్లోరోగులకు, వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాల్లో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. క్రీడా పోటీలు ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- వనపర్తి మండలంలోని కడుకుట్లలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు విష్ణు, తిరుపతయ్యగౌడ్, తిరుమలేష్, గిరి, ప్రణీత్‌గౌడ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివేకానంద విగ్రహానికి పలువురు వేర్వేరుగా పూటమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్టర్ బాలు, మ్యాడం శ్రీను, రాజేష్, సంతోష్‌కుమార్, లింగన్న, రాము, వినోద్, స్థానికులు, అహోప, ఆర్యవైశ్యసంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ఆరేపల్లి, కత్తేపల్లి గ్రామాల్లో సేవాసమితి ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం 50 మంది యువకులు రక్తదానం చేశారు.
- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, మధు, భాస్కర్, దీర్ఘాయువు, రవినాయక్, సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో వివేకానందుడి విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో మన్నెపురెడ్డి, రవిచందర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిక్కన్న, బుచ్చిరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- ఏదుల మండల కేంద్రంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 15 మంది యువకులు రక్తదానం చేశారు. మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి గోపాల్‌పేట మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.
- అమరచింతలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ మంత్రి సుధీర్, ఏబీవీపీ నాయకులు అఖిల్, సాయి, తిరుమలేష్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అమరచింతలో మాట్లాడుతున్న మంగమ్మ



ఏదుల మండల కేంద్రంలో..

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: సృష్టిలో ప్రథమ గ్రంథం భగవద్గీత అని, అందుకే ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేయడానికి ఆదివారం మండలంలోని నాటవెల్లిపెద్దతండాలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు భగవద్గీత గ్రంథాలను పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవద్గీత జ్ఞానం ప్రకారం క్రాంతి అంటే తిరుగుబాటు అని 'సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని' సుఖ, భోగ, వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని భోగి మంటలు వేస్తారని వివరించారు.



భగవద్గీత గ్రంథాలను అందజేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు

కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండాపోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందని, మకర సంక్రాంతిని పెద్దపండుగ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సి.కృష్ణయ్య, నాగరత్నం, లలిత, స్వరూప, శివమ్మ, అలివేలమ్మ తదితరులు ఉన్నారు.

యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ రమేష్ వర్ధంతి, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువకులు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి బొమ్మరమేష్ తండ్రి వెంకటేశ్వర్లు, యువకులు కలిసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు మాట్లాడుతూ బొమ్మ రమేష్ జ్ఞాపకార్థం సోమిశెట్టి కిషోర్ సౌజన్యంతో యువకులంతా రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఆరోగ్యవంతమైన యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో గొబ్బూర్ నవీన్, కిషోర్ పాల్గొన్నారు.

నేటినుంచి వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

ఖిల్లాఘనపురం: ఖిల్లాగట్టు వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పట్టాభిరాములు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఖిల్లాగట్టు ప్రథమ ముఖ ద్వారం వద్ద కాకతీయుల కాలంలో వెలిసిన స్వామి వారి ఉత్సవాలను పురాతన కాలం నుంచి ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి సమయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ఉత్సవాల వివరాలు

ఖిల్లాగట్టు వీరాంజనేయస్వామి ఉత్సవాలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం ఉదయం స్వామివారి సుప్రభాతసేవతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామావళితో పాటు స్వామివారి ఉత్సవ విగ్రహం, పాదుకలను(ఉద్దాలు) ఆంజనేయ స్వామి మాలధారులు ఊరేగింపుగా గ్రామం నుంచి గట్టుపైకి చేర్చుతారు. రాత్రివేళలో వివిధ గ్రామాల నుంచి వచ్చే భజన మండలి భక్తులచే అఖండ భజన చేస్తారని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం పంచామృత అభిషేకం, స్వామివారికి సహస్రనామార్చన, తమలపాకులు, పుష్పాలతో ప్రత్యేక పూజలు, మకర సంక్రాంతి దివ్య జ్యోతిని వెలిగించడం అభిషేక కార్యక్రమాలతో పాటుగా స్వామివారి జలకేళి తెప్పోత్సవం, రథోత్సవం చేస్తారు.



వీరాంజనేయ స్వామి ఆలయం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరు యువకులకు గాయాలయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మక్తల్ మండలంలోని గడ్డంపల్లికి చెందిన అంజి, రాములు ఆత్మకూర్ నుంచి స్వగ్రామమైన గడ్డంపల్లికి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం బాధితులను 108 వాహనంలో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ఖిల్లాఘనపురం: జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడేది టీయుడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అని యూనియన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరావు అన్నారు. ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి జి.మధుగౌడు పిలుపు మేరకు ఆదివారం ఖిల్లాఘనపురంలోని ఎమ్మార్సీ వద్ద యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్‌లు రాజేందర్, వెంకట్‌గౌడ్, విజయ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఐజేయూ మండల అధ్యక్షుడిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా టి.యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా శాంతకుమార్, గౌరవ సలహాదారులుగా సాయిలు, బాల్‌రాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని జిల్లా, మండల కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అమరచింత: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమతో పాటు చదివి అకాలంగా మృతి చెందిన మిత్రులకు నివాళులర్పించారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు బాలస్వామి, శేఖర్‌రెడ్డి, సుదర్శన్, బాబు దేవీదాస్, ఎస్పీ రత్నం, రాఘవన్, సుదర్శన్‌రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు వెంకటేష్, సత్యేందర్, షబ్బీర్, రవి తదితరులు పాల్గొన్నారు.



అప్పరాలలో సుందరగిరి ఉత్సవాలు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో గల సుందరగిరి గుట్టపై వెలిసిన పరమేశ్వర స్వామిడి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని అర్చకులు పరమేష్, విజయ్, సంపత్ తెలిపారు. ప్రతి ఏడాది పుష్య మాసంలో పౌర్ణమికి దగ్గరగా ఉండే సోమవారం స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరగిరి గుట్టపైకి పల్లకీ సేవలతో తీసుకొస్తారు. సోమవారం ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, మహానైవేద్యం సమర్పిస్తారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి 9గంటలకు స్వామివారికి నందికోళ్ల సేవ, మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం అనంతరం జాతర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.



ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తీసుకెళ్తున్న భక్తులు

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

వనపర్తి టౌన్: సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు సింగిరెడ్డి వాసంతి అన్నారు. వెంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సింగిరెడ్డి వాసంతి మాట్లాడుతూ.. రైతులు, మహిళలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకొంటారని, రంగవల్లులు, గొబ్బెమ్మలు పెట్టడం ఆనాదిగా వస్తుందని, ఇందులో సైన్స్ దాగి ఉందన్నారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు అందించడంతో పాటుగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహకంగా హాట్ బాక్స్‌లను అందించారు. అదేవిధంగా 28వ వార్డులో జంగిడి రవియాదవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలేఖ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉంగ్లం తిరుమల్, వేంకటేశ్వర ఆలయ చైర్మన్ అయ్యలూరి రఘునాథాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న సింగిరెడ్డి వాసంతి, కౌన్సిలర్ అలేఖ్య

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

కొత్తకోట రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెడ్డి యువజన సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించడంతో పాటు పీపీఎల్ 6 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వలను తవ్వించి ప్రతి ఎకరాకు సాగు అందిస్తామన్నారు. పొలాలకు వెళ్లే బాటలకు మరమ్మతు చేయించి రైతుల ఇబ్బందులను తొలగిస్తానని హామీనిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మన్నెపురెడ్డి, నాగిరెడ్డి, పాపిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, యాదవరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం



పెద్దగూడెంలో బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి



రేమద్దులలో..

వనపర్తి రూరల్: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్నిస్తాయని రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కిష్టగిరి, పెద్దగూడెంతండాలో నిర్వహిస్తున్న సంత్ సేవాలాల్ యూత్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమి, గెలుపులు సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడల వల్ల ఐక్యత, మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులు ప్రకటించి ఉత్సాహ పరిచారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు పొందిన శంకర్‌నాయక్, మోహన్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నందిమళ్ల అశోక్, ధర్మానాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రేమద్దులలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులకు క్రికెట్, వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీలను శాంతియుతంగా, స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు.

నర్సింహాస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి సమీపంలో గుట్టల్లో వెలిసిన లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా గుట్టల్లో వెలిసిన లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు వస్తారు. దర్శనానికి వచ్చే భక్తుల ఇబ్బందులను సంగినేనిపల్లి కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా.. రూ.4 కోట్లతో ఆలయం వరకు బీటీ, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు వసతులు కల్పించారు. స్వామివారి దర్శనానికి మండలంలోని సంగినేనిపల్లి, తూంకుంట, వల్లభాపురం, వీపనగండ్ల, బొల్లారం, కల్వరాల గ్రామాలతో పాటు పాన్‌గల్, పెంట్లవెల్లి, చిన్నంబావి మండలాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులకు అదే గ్రామానికి చెందిన కట్ట కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి బృందంచే సంగీత విభావరి, పలకలు, కోలాట భజనలు, మ్యూజికల్ ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలను తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు.